# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :219 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 05-11-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఆగని విద్యార్థుల ఆత్మహత్యలు

జైపూర్, నవంబర్ 4 : ఉన్నత చదువులు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ఒత్తిడి కారణంగా ఇప్పటికే పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మరో విద్యార్థి తనువు చాలించాడు. బీహార్‌కు చెందిన 16 ఏళ్ల విద్యార్థి జేఈఈ పరీక్షకు సన్నద్ధమవుతున్నాడు. ఏడాది కాలంగా తన తల్లితోపాటు కోటాలోని తలవండి ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. అయితే, ఆదివారం రాత్రి డిన్నర్ చేసిన తర్వాత తన గదిలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు కోట డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యోగేష్ శర్మ తెలిపారు. విద్యార్థిది ఆత్మహత్యా..? లేక సహజ మరణమా..? అనేది ఇంకా నిర్ధారించలేదు. అతడి గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని.. శవపరీక్ష తర్వాతే విద్యార్థి మరణానికి గల కారణాలు తెలుస్తాయని ఆయన తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. కాగా, తాజా ఘటనతో కలిసి ఈ ఏడాది కోటాలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఇది

## ప్రజల గొంతు తడిపే అద్భుత స్కీం అమృత్...



కరీంనగర్: ప్రజల గొంతు తడిపే అద్భుతమైన పథకం అమృత్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అమృత్ 1 కింద దేశవ్యాప్తంగా రూ.50వేల కోట్లను ఖర్చు చేసి నూతనంగా 1 కోటి 34 లక్షల నీటి కనెక్షన్‌లు అందించడంతో పాటు 1 కోటి 2 లక్షల మురుగు నీటి కనెక్షన్‌లు ఇచ్చామని వెల్లడించారు. అమృత్ 2లో భాగంగా రూ.2.99లక్షల కోట్ల వ్యయంతో దేశంలోని మున్సిపాలిటీలు, నగరాల్లో నీటి కోసం అల్లాడుతున్న ప్రజల దాహార్తిని తీర్చబోతున్నామన్నారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి అమృత్ 1, 2 కింద రూ.6876 కోట్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రతి ఒక్కరికీ 24గంటల పాటు తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని, ఈ విషయంలో కేంద్రం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు."రాజకీయాల కంటే అభివృద్ధి ముఖ్యం. ఎన్నికల వరకే రాజకీయాలు. పగలు, పంతాలకు పోతే అభివృద్ధి చేయలేం. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేం. అందుకే కలిసికట్టుగా పనిచేద్దాం. అభివృద్ధిలో కరీంనగర్ ను ఆదర్శంగా నిలుపుదాం"అని పిలుపునిచ్చారు. అతి త్వరలో కొండగట్టు, వేములవాడ, ఇల్లంద కుంట ఆలయాలను టెంపుల్ సర్క్యూట్ పరిధిలోకి తీసుకొచ్చి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్ లోని టీటీడీ దేవస్థానానికి నిధుల మంజూరు అంశంపైనా టీటీడీ ఛైర్మన్ తో మాట్లాడినట్లు తెలిపిన కేంద్ర మంత్రి ఈ విషయంలో సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈరోజు కరీంనగర్ సిరిసిల్ల బైపాస్ రోడ్డు సమీపంలోని ప్రజారోగ్య శాఖ కార్యాలయం వద్ద విలీన గ్రామాల కోసం అమృత్ 2 స్కీం కింద ఫిల్టర్ బెడ్ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, సుడా ఛైర్మన్ నరేందర్ రెడ్డితో పాటు స్థానిక బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటేమన దేశంలో 36శాతం జనాభా నగరాల్లోనే నివసిస్తోంది. 2047 నాటికి పట్టణాల్లో నివశించే జనాభా 50శాతం కంటే ఎక్కువ కాబోతోందన్నారు. ప్రస్తుతం పట్టణాల్లో నివశిస్తున్న ప్రతి వ్యక్తికి రోజుకు సగటున 136లీటర్లు అవసరం. కానీ 69లీటర్ల నీరు మాత్రమే అందుతోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో దూరదృష్టితో నగరాలు, పట్టణాల్లో నివశించే ప్రతి ఇంటికీ సరిపడా నీటిని అందించంతో పాటు, డ్రైనేజీ సౌకర్యం కల్పించి నీటి భద్రతా నగరాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అమృత్ 1(అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) పథకాన్ని ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చే గొప్ప పథకం అమృత్ అన్నారు. 2015 జూన్ 25న ప్రారంభమైన అమృత్ 1 పథకం కింద (2015-16 నుండి 2019-20 వరకు) కేంద్ర ప్రభుత్వం తన వాటాకింద ఖర్చు 50వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. అమృత్ స్కీం ద్వారా దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 1కోటి 34లక్షల నీటి కనెక్షన్‌లు అందించగలిగామన్నారు. 1 కోటి 2 లక్షల మురుగునీటి కనెక్షన్‌లు అందించామని, వీటితో పాటు 2వేల 411 పార్కులను అభివృద్ధి చేసుకోగలిగామన్నారు. 62 లక్షల 78వేల ఎల్ఈడీ లైట్లను మార్చుకోగలిగామన్నారు. అమృత్ 2.0 పథకం కింద కేంద్ర, రాష్ట్రాలు, మున్సిపాలిటీల భాగస్వామ్యంతో ఈసారి 2లక్షల 99వేల కోట్ల రూపాయల ఖర్చు చేయాలని నరేంద్రమోదీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మన రాష్ట్రం విషయానికొస్తే అమృత్ 1, అమృత్ 2.0 కింద మొత్తం 6వేల 876కోట్లు ఖర్చు చేయబోతున్నామన్నారు. ఇందులో కేంద్రం వాటా 3వేల 591కోట్ల 72లక్షల అని, రాష్ట్ర వాటా కింద 2వేల 614 కోట్ల 82లక్షలని, ఎంపిక చేయబడిన మున్సిపాలిటీల వాటా 669 కోట్ల 85 లక్షలన్నారు. అమృత్ 1 కింద 11 వందల 53 కోట్లు, అమృత్ 2కింద 2వేల 438 కోట్ల రూపాయలను నరేంద్రమోదీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా విషయానికొస్తే%% అమృత్ 1, అమృత్ 2 కింద మొత్తం 852 కోట్ల 11 లక్షల రూపాయలు కేటాయించామన్నారు. అందులో కేంద్ర వాటా 481కోట్ల 19 లక్షలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 297 కోట్ల 55 లక్షలు, మున్సిపాలిటీల వాటా 73 కోట్ల 37 లక్షలన్నారు. ఇక మన కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ విషయానికొస్తే తాను మొదటిసారి ఎంపీగా గెలిచిన తరువాత అమృత్ 1 కింద 136 కోట్ల 56 లక్షల రూపాయలు ఖర్చు చేసినమన్నారు. ఇందులో కేంద్రం 80కోట్ల 10 లక్షల రూపాయలను ఖర్చు చేసిందన్నారు. గతంలో కరీంనగర్ కు 2,3 రోజులకోసారి నీళ్లు వచ్చేవని, ఈ పథకం వల్ల ప్రతిరోజూ కరీంనగర్ వాసులకు మంచి నీళ్లను అందించగలుగుతున్నామన్నారు. ఈరోజు అమృత్ 2 పథకాన్ని ప్రారంభించుకోబోతుండటం ఆనందంగా ఉందన్నారు.

## ఏడాదికి ఇక మిగిలింది 35 రోజులే

హైదరాబాద్,నవంబర్4:అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. వంద రోజుల్లో ప్రతి గ్యారెంటీ నెరవేరుతందని చెప్పిన మోసగాళ్లకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందని హెచ్చరించారు. ఇప్పటి వరకు 330 రోజులు ముగిశాయని, ఏడాది నిండడానికి ఇంకా 35 రోజులే మిగిలిందన్నారు. కాంగ్రెస్ హామీలపై ఢిల్లీ బాబు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చెప్పిన హామీలన్నీ బూడిదలో పోసిన పన్నీరుగానే మిగిలాయని, చెప్పని మూసీలో లక్షల కోట్ల మూటలయ్యాయని మండిపడ్డారు. ఏడాది కాలమంతా అటెన్షన్ డైవర్షన్‌తో మూసీ సర్కార్ పబ్బం గడిపిందని విమర్శించారు. ఈ ప్రజా పాలనలో ధర్నాలు, రాస్తారోకోలు తప్ప చెప్పుకోవడానికి ఏమున్నదని ప్రశ్నించారు. వంద రోజుల్లో నెరవేరుతుంది ప్రతి గారంటీ' అని చెప్పిన మోసగాళ్లకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు. మూడు వందల ముప్పై రోజులు ముగిసింది, ఏడాది నిండడానికి 35 రోజులే మిగిలింది! ఏడాదికి 35 రోజులు మాత్రమే మిగిలింది-2 లక్షల జాబ్ లు ఎక్కడ అంటున్నారు నిరుద్యోగులు. ఎకరాకు రూ.15000 రైతు భరోసా ఏమైంది అంటున్నారు రైతన్నలు. పెంచిన రూ.4,000 పెన్షన్ ఎక్కడంటున్నారు అవ్వ తాతలు, నెల నెల ఇస్తామన్న రూ.2500 ఎక్కడబోయాయి అంటున్నారు అడబిడ్డలు. చి ఇస్తామన్న రూ.6,000 పెన్షన్ ఎక్కడని నిలదీస్తున్నారు దివ్యంగా అన్నలు,అక్కలు. ఉద్యోగులు మా పీఆర్సీ ఎక్కడ, మా డీఏలు ఎక్కడని సమ్మెలకు సై అంటున్నారు. కౌలు రైతులు రూ.15000 ఎక్కడ, రైతు కూలీలు రూ.12000 ఎక్కడ అంటున్నారు. తులం బంగారం ఎక్కడా అంటున్నారు మా బంగారు తల్లులు. చెప్పిన హామీలన్నీ బూడిదలో పన్నీరయ్యే ? చెప్పని మూసీలో లక్షల కోట్ల మూటలాయే. ఏముంది ఈ ప్రజా పాలనలో గర్వకారణం ధర్నాలు,రాస్తారోకోలు తప్ప?జవాబు చెప్తావా ఢిల్లీ బాబు రాహుల్ గాంధీ?' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

నాడు గింజ గింజకు కేసీఆర్ హామీ.. నేడు గడియ గడియ గండమే



హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి సర్కారు నిర్లక్ష్యం చేస్తుందని ఆయన మండిపడ్డారు. అకాల వర్షాలకు రైతన్నల రెక్కల కష్టం నీళ్లల్లో తడిసి ముద్దయిందని.. రైతులు ధర్నాలు చేస్తున్నారన్నారు. మిల్లర్లు షరతులు విధిస్తున్నారన్నారు. పెళ్లిళ్లలో సీఎం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు బిజీగా ఉన్నారన్నారని విమర్శించారు. తెలంగాణ రైతన్న నడ్డివిరిచి గాల్లో మోసకారి కాంగ్రెస్ విహరిస్తుందిన మండిపడ్డారు.దసరా, దీపావళి పోయిందని.. కార్తీకమాసం వచ్చినా కొనుగోళ్లు కానరావడం లేదన్నారు. నాడు గింజగింజకు కేసీఆర్ హామీ ఇచ్చారని.. నేడు గడియగడియ గండమేనన్నారు. మిల్లర్లతో చర్చలు లేవని.. రైతుకు భరోసా కరువైందన్నారు. అన్నదాతను గాలికి వదిలిన గాలి మోటార్ సర్కార్ అంటూ విమర్శించారు. ధాన్యం కొంటే రూ.500 బోనస్ అన్నారని.. అసలు కొనకుంటే అంతా భోగస్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలు, సమావేశాలు లేవన్నారు. ధాన్యంపై కప్పేందుకు కవర్లు లేవన్నారు. రుణమాఫీ జరుగడం లేదన్నారు. రైతుబంధు, రైతుబీమా లేదన్నారు. చివరకు పంట కొనుగోళ్లు లేవన్నారు. లేవు లేవు లేవు అసలేమీ లేవు ఈ అసమర్థపు సన్నాసి పాలనలో ఏమి లేవంటూ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మాజీ సర్పంచ్ ల విడుదల కోరుతూ హరీశ రావు ధర్నా



హైదరాబాద్: పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ నేడు ఛలో హైదరాబాద్ కు పిలుపునిచ్చారు మాజీ సర్పంచ్ లు. అయితే హైదరాబాద్ కు వెళ్లకుండా మాజీ సర్పంచ్ లను ముందస్తుగానే ఆయా జిల్లాలలోనే అరెస్ట్ చేశారు పోలీసులు. ఈ అరెస్ట్ లను హరీశ్ రావు ఖండించారు. అరెస్ట్ అయినవారిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ తిరుమలగిరి పీఎస్ ముందు రోడ్డుపైన హరీశ్ రావుతో పాటు మండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, , వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ సంజయ్ తోపాటు పలువురు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మాజీ సర్పంచ్‌ల అరెస్టులను, అక్రమ నిర్బంధాలను తీవ్రంగా ఖండించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడమేంటని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్‌కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచులను అరెస్టులు చేయడమేనా అని నిలదీశారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచులకు మాత్రం బిల్లులు చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. అక్రమంగా నిర్బంధించిన, అరెస్టులు చేసిన మాజీ సర్పంచులను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## సర్కారు బడుల అభివృద్ధికి సమాజమంతా బాధ్యత తీసుకోవాలి

హైదరాబాద్: మెరుగైన ఫర్నిచర్, ల్యాబ్స్‌పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. విద్యానగర్ జామై ఉస్మానియా పాఠశాలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బెంచీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు పెరగాలన్నారు. సర్కారు బడుల అభివృద్ధికి సమాజమంతా బాధ్యత తీసుకోవాలని సూచించారు.కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యం కనిపిస్తోందన్నారు దివాళకోరు, దగాకోరు రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. అమలు కానీ హామీలు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని కిషన్ రెడ్డి చురకలంటించారు. ఇచ్చిన హామీలకే గతిలేదని, కొత్తగా మళ్లీ హామీలిస్తున్నారన్నారు. కర్నాటకలో హామీలు అమలు చేయలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో అనేక వాగ్దానాలతో కాంగ్రెస్



అధికారులోకి వచ్చిందని దుయ్యబట్టారు. డిక్లరేషన్, గ్యారంటీల పేరుతో గారడీ చేశారని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు.

## మహారాష్ట్ర ఎన్నికల నుంచి వైదొలగిన మనోజ్ జరాంగే..!



ముంబై: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. పలు పార్టీలు గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. అయితే, ఈ ఎన్నికల్లో పోటీ విషయమై మరాఠా రిజర్వేషన్ కోసం పోరాడుతున్న మనోజ్ జరాంగే పాటిల్ యూటర్న్ తీసుకున్నారు. 'మహా' ఎన్నికల నుంచి వైదొలిగారు. కాగా, నవంబర్ 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తమ అభ్యర్థులు పోటీ చేస్తారని మనోజ్ జరాంగే ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. తన పార్టీ తరఫున ఏడుగురు అభ్యర్థులను పోటీ చేయించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అదేవిధంగా మరో ఆరు నియోజకవర్గాల్లో అధికార పార్టీ కూటమి అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. మరో 2 నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే, గంటల వ్యవధిలోనే యూటర్న్ తీసుకున్నారు. మహారాష్ట్ర ఎన్నికల నుంచి వైదొలిగారు. 'ఒకే కులం బలంతో ఎన్నికల్లో పోటీ చేసి గెలవడం అసాధ్యం. మనం రాజకీయాల్లోకి కొత్త. అభ్యర్థిని నిలబెట్టి ఓడిపోతే ఆ కులానికి అవమానం. అందుకే మరాఠా అభ్యర్థులందరినీ అభ్యర్థిస్తున్నాను.. తమ నామినేషన్లను ఉపసంహరించుకోండి' అని అన్నారు. మరాఠాలకు న్యాయం చేయని వారిపై మాత్రమే పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కాగా, విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతంగా సాగిన విషయం తెలిసిందే. ఈ ఆందోళనలకు సామాజిక కార్యకర్త అయిన మనోజ్ జరాంగే నేతృత్వం వహించారు. గతేడాది నుంచి ఏకంగా ఆరుసార్లు నిరాహార దీక్షకు దిగారు. అప్పటి నుంచి ఆయన పేరు నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోంది. ఈ దీక్షతో దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనతో చర్చలు కూడా జరిపింది. జరాంగే ఉద్యమం కారణంగా ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 'మహాయుతి' కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో తాజా అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన మద్దతు కోసం వివిధ పార్టీలు క్యూ కట్టాయి. ఈ క్రమంలో ఆయన అనూహ్య నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇక 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీకి ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించనుండగా.. 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

## తీరు మార్చుకుంటే మంచిది

అమరావతి, నవంబర్ 4 : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు శాయశక్తులా శ్రమిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. తాను పరుగులు పెట్టడంతో పాటు ఎమ్మెల్యేలను, మంత్రులను కూడా పరుగులు పెట్టిస్తున్నారు. అలాగే తప్పు చేసిన నాయకుల పట్ల కూడా సీఎం సీరియస్‌గా ఉంటున్నారు. స్వంత పార్టీ నేతలను కూడా క్రమశిక్షణలో ఉండాలని.. ఎలాంటి తప్పు చేయకూడదని గట్టిగానే చెబుతున్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ ప్రథమ కర్తవ్యం అని నేతలకు నిర్దేశిస్తున్నారు. తప్పు చేస్తే ఎవరైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు కూడా. తన మన అనే తేడా లేకుండా సొంత పార్టీ నేతలకు కూడా వార్నింగ్‌లు ఇస్తున్నారు సీఎం. నేతల తీరుతో పార్టీకి ఇబ్బందులు ఎదురైనప్పుడల్లా సీఎం అలర్ట్‌గా ఉంటూ.. పార్టీ ఎమ్మెల్యేలకు, నేతలకు స్వీట్ వార్నింగ్స్ ఇస్తూనే.. హద్దులు దాటుతున్న వారిని ప్రత్యేకంగా పిలిపించి మరీ హెచ్చరిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా ఓ మంత్రికి కూడా గట్టిగా క్లాస్ తీసుకున్నారు సీఎం. ఇంతకీ ఎవరా మంత్రి.. ఎందుకు సీఎం క్లాస్ పీకారో ఇప్పుడు తెలుసుకుందాం. మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు క్లాస్ తీసుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. టీడీపీ సభ్యత్వ నమోదుకు సంబంధించి మంత్రికి సీఎం గట్టిగానే క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. సభ్యత్వ నమోదులో వెనుకబడి ఉన్నారని.. వేరే రాష్ట్రం నుంచి వచ్చినా ఎమ్మెల్యేను, మంత్రిని చేశానని.. రాజకీయాలపై సీరియస్‌నెస్ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మిమ్మల్ని మీరు నిరూపించుకోకపోతే ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి వస్తుందంటూ మినిస్టర్‌కు ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు."సభ్యత్వ నమోదులో అందరికంటే వెనుకబడి ఉన్నావు. రాజకీయాలపై నీకు సీరియస్ తనం రాలేదు. ఫస్ట్ టైం ఎమ్మెల్యేవి, ఫస్ట్ టైం మంత్రివి సభ్యత్వ నమోదులో ఎక్కడున్నావో చూసుకున్నావా. 29% శాతం మాత్రమే సభ్యత్వం నమోదు అయింది. 9000 గాను 2630 మాత్రమే చేశారు. ఫస్ట్ టైం వచ్చావు నీకు పార్టీ చాలా గౌరవించింది. వేరే రాష్ట్రం నుంచి వచ్చిన నీకు ఎమ్మెల్యే ఇచ్చి మంత్రిని చేశాం. నీకు పట్టుదల లేకపోతే




ఎలా . సీరియస్‌గా తీసుకోవాలి. నా బాధ్యత నేను చేస్తున్న మీ వాయిస్ మీరు చేయాలి. పార్టీకి ఉపయోగపడకపోతే రాజకీయాలు ఎందుకు. మీరు పని చేయకపోతే ఎమ్మెల్యేగా ఎలా ప్రూవ్ చేసుకుంటారు. మీరు ప్రూవ్ చేసుకోకపోతే ఆల్టర్నేట్ చూసుకుంటా. ఎక్స్పెక్టేషన్స్‌కు తగ్గట్టు పని చేయలేదని ప్రజలకు కూడా తెలియజేస్తా. నేను 95 సీఎంని అని అందరికీ చెప్తున్నా" అంటూ మంత్రి వాసంశెట్టి శుభాష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గట్టిగానే క్లాస్ తీసుకున్నారు. ఈ వ్యవహారం పార్టీతో పాటూ రాష్ట్ర వ్యాప్తంగా కూడా చర్చనీయాంశంగా మారింది.

### తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్,నవంబర్4: తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. పాఠశాల విద్యాశాఖ ఈమేరకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. నవంబర్ 5 వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. పూర్తి వివరాల కోసం రేపటి నుంచి వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

సంపాదకీయం
మంగళవారం 05-11-2024

## మోహన్ భగవత్ టు మోడీ... అదే దాడి!

తనకు తానే తుమ్మి చిరంజీవ అనుకున్నారని సామెత. ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన ఎన్డీయే కూటమి పరిస్థితి అలాగే వుంటుంది. తమ హయాంలో జరిగిన ప్రగతికి ప్రపంచం దిగ్భ్రాంతి చెందుతోందని, ప్రపంచం భారత దేశం వంక చూస్తున్నదని అహోరాత్రులు చెబుతూనే వుంటారు. ఇందుకు ఆధారాలు చూపకూడా అంటే అదీ వుండదు. అంతర్జాతీయ మీడియాలో విమర్శలు వస్తే వెంటనే కట్ట కట్టుకుని దాడి చేస్తారు. సోషల్ మీడియాలో మొదలై కేంద్ర మంత్రుల దాకా ఆ పవిత్ర ఖండనలో పాలు పంచుకుంటారు. ఈ ప్రహసనం పదేళ్లుగా సాగుతూనే వుంది. తాజాగా అక్టోబరు 31వ తేదీన ప్రధాని మోడీ సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవం తతంగంలో ఇదే చేశారు. సర్దార్ పటేల్ విగ్రహం దగ్గర ప్రసంగిస్తూ ఏకపక్ష వ్యాఖ్యానాలు గుప్పించారు. అసలు ఆ రోజును పటేల్‌తో ముడి పెట్టి ఈ ఉత్సవం జరపాలని నిర్ణయించడమే పెద్ద రాజకీయం. ఎందుకంటే దీర్ఘకాలం దేశాన్ని పాలించిన ప్రధాని ఇందిరా గాంధీ అధికార నివాసంలోనే కుట్రపూరితంగా హత్యకు గురైన రోజు అది. రాజకీయ విభేదాలు, ఎవరి తప్పొప్పులు ఎలా వున్నా దేశ చరిత్ర మారదు. అందులోనూ అత్యున్నత పదవిలో వున్న ప్రధాని హత్యకు గురైన ఘటన ఉద్వేగంతో ముడిపడి వుంది. అదే రోజున సిక్కులపై ఊచకోత కూడా జరిగింది. బిజెపి వ్యూహంలో ఈ రెండో అంశాన్నే చెబుతూ ప్రధాని ఇందిర హత్యను విస్మరించే విధానం మొదలుపెట్టారు. ఎక్కడో అమెరికాలో కెనడీ హత్య గురించి దశాబ్దాల తరబడి చెప్పే బడా మీడియా కూడా నాటి చరిత్రను పూర్తిగా వదిలేసింది. ఎందుకంటే ఏ ప్రముఖ పత్రికలోనూ ఛానల్‌లోనూ ఆమె గురించిన రాతలు లేవు. ఒక పెద్ద పత్రిక సిక్కులపై హత్యాకాండ గురించి మాత్రం రాసింది. మీడియా పాలకుల చెప్పుచేతల్లో ఎంతగా చిక్కుకుపోయింది దీన్నిబట్టే తెలుస్తుంది. సర్దార్ పటేల్ నామస్మరణతో నాటి అత్యున్నత నాయకుడు నెహ్రూను మరుగుపర్చడం మోడీ వ్యూహం. అయితే పార్టీలు ఏవైనా హత్యలకు గురైన కీలక నాయకులను కూడా విస్మరించడం మొదలు పెడితే చరిత్రకే అపచారం తప్పదు.


370 రద్దు రాజ్యాంగ రక్షణా?

వర్తమానానికి వస్తే మోడీ ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలలో తలకిందులు తర్కం, రాజకీయ వ్యూహం దిగ్భ్రాంతి కలిగిస్తాయి. మొదటే చెప్పినట్టు దేశం అమోఘంగా పురోగమించిందని తనకు తనే కితాబులిచ్చుకోవడం ఒకటి. అంతకు మించింది రాజ్యాంగ రక్షకుడుగా తనను తాను చెప్పుకున్న తీరు. దేశంలో రాజ్యాంగ మూల సూత్రాలపై జరుగుతున్న దాడి గురించి దేశమంతా ఆందోళన చెందింది. మొన్నటి ఎన్నికల్లో ప్రజా తీర్పులోనూ ఆ విషయం ద్యోతకమైంది. 400 సీట్ల కోతల నుంచి సగానికి కొంచెం ఎక్కువగా మాత్రమే తెచ్చుకున్న మోడీ కూడా దీన్ని గుర్తించి రాజ్యాంగ పటానికి పూజలు ప్రారంభించారు కూడా. అంతకు ముందు రెండు సార్లు గెలిచినప్పుడు ఈ షో లేదే మరి? రాజ్యాంగ రక్షణ గురించి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు కూడా పదే పదే ప్రస్తావించడం, విచారణలో వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఇవేవీ గమనించకుండా మోడీ రాజ్యాంగ గ్రంథం పట్టుకున్నారనుకుంటే పొరబాటే. కానీ మొన్నటి ప్రసంగంలో ఆయన తీసుకున్న వాదనే వింతగా వుంది. రాజ్యాంగం పేరుతో తమకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ఆయన ఆరోపణ! ఒకే దేశం ఒకే పన్ను, ఒకే కార్డు వంటి వాటిని ఏకరువు పెట్టిన తర్వాత ఒకే దేశం ఒకే రాజ్యాంగం వుండేలా తాము కీలక చర్యలు తీసుకున్నామని కొత్త పాట ఆలపించారు. కాశ్మీర్ 370వ అధికరణం రద్దుకు సమర్థన ఇది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక నిబంధనలు ఇవ్వడం వేరే రాజ్యాంగం అవుతుందా? ఇప్పటికీ అనేక రాష్ట్రాలకు కొన్ని విషయాల్లో ప్రత్యేక నిబంధనలు వున్నాయి. 370 అధికరణం రద్దు నిజానికి రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీసిన చర్య. ఇటీవలి ఎన్నికలలో కాశ్మీర్ ప్రజలు ఆ చర్యను తిరస్కరించారు కూడా. అయినా అదే తమ విజయమైనట్టు, ఒకే రాజ్యాంగం అమలులోకి తెచ్చినట్టు చెప్పుకోవడం మోడీ గడుసుతనం తప్ప ఇసుమంత నిజం లేదు. రాజ్యాంగ మూల సూత్రాలైన లౌకికతత్వం, సమాఖ్యతత్వం, ప్రజాస్వామ్య భావప్రకటనా స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సార్వభౌత్వం కీలకమైనవి. ఇందులో ప్రతిదానిపైన పనిగట్టుకుని దాడి చేసిన, చేస్తున్న మోడీ అదేదో రాజ్యాంగ రక్షణగా చెప్పుకోవడం వింతల్లో వింత.

కాశ్మీర్ పరిస్థితే అన్ని రాష్ట్రాలకీనా?

మోడీకి గడుసుతనం ఎక్కువే కావొచ్చుగానీ ప్రజల తెలివిని మరీ తక్కువ అంచనా వేస్తే చెల్లుతుందా? ఉన్న ఒక రాజ్యాంగ స్ఫూర్తిని భగం చేసే మహత్కార్యంలో ఆయన 370 అధికరణం రద్దు తర్వాత దేశంలోని రాష్ట్రాలన్నిటికీ ఎసరు పెట్టడం యాదృచ్ఛికం కాదు. ఈ జాతీయ సమైక్యతా ప్రసంగంలోనే ఒకే దేశం ఒకే ఎన్నిక మంత్రోచ్చారణలో మర్మం అదే. మిగిలిన రాష్ట్రాలకూ అదే గతి పట్టిస్తానని ఆయన సందేశం సంకేతం కూడా. ఎందుకంటే రాజ్యాంగం రెండవ అధికరణం దేశాన్ని రాష్ట్రాల సమాఖ్య (యూనియన్ ఆఫ్ స్టేట్స్) అని నిర్వచిస్తున్నది. అమెరికాలో లాగా ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో లాగా రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగాలు లేకున్నా స్వయం ప్రతిపత్తి వుండాలని రాజ్యాంగం అభిలషించింది గనకే ఇలా స్పష్టంగా పేర్కొంది. కానీ 'ఒకే దేశం, ఒకే కార్డు, ఒకే పన్ను, ఒకే రేషన్, ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే నేత ఇలా ఒన్ మానియా పట్టిన మోడీజీ ఒకే ఎన్నిక వుంటేనే ఒకే దేశం అంటున్నారు. ఇది అక్షరాలా ఆరెస్సెస్ తరహా కేంద్రీకృత పెత్తనాన్ని, కార్పొరేట్ తరహా ఒకే మార్కెట్ వ్యూ వ్యూహాన్ని కలగలపిన ఆరెస్సెస్ మాజీ ప్రచారక ప్రావీణ్యమే. పంజాబ సింధు గుజరాత మరాఠా ద్రావిడ ఉత్కళ వంగ.. అంటూ రవీంద్రనాథ్ టాగూర్ పాడినప్పటికి దేశ స్వాతంత్ర్యం కనుచూపు మేరలో లేదు. రాష్ట్రాలూ ఈ విధంగా లేవు. దక్షిణాది రాష్ట్రాలూ భాషలన్నిటినీ కలిపి ద్రావిడ అన్నారు. సింధ్ ప్రాంతం ఇప్పుడు ఇండియాలోనే లేదు. అయినా ఈ దేశ చరిత్రను, స్వభావాన్ని ఆయన గానం చేశాడు గనక దాన్నే జాతీయ గీతంగా పాడుకుంటున్నాం. విభిన్న భాషా సంస్కృతుల సమ్మేళనమైన భారత దేశం వైవిధ్య వైభవానికి సంకేతంగా గౌరవించుకుంటున్నాం. అందులోంచి పుట్టిన స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి దేశాన్ని ఒక్క తాటిపై నడిపింది. ఒకే దేశం, ఒకే కార్డు, ఒకే పరీక్ష, ఒకే పన్ను, ఒకే భాష, ఒకే మతం, ఒకే నాయకుడు వంటి నినాదాలూ విధానాలూ ఇందుకు పూర్తి విరుద్ధమైనవి. కేంద్రం లోని మోడీ ప్రభుత్వం బలవంతంగా ముందుకు తెస్తున్న ఒకే దేశం ఒకే ఎన్నిక (వన్ కంట్రీ వన్ ఎలక్షన్) పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తిని తోసిపుచ్చే కేంద్రీకృత పెత్తనానికి బాట వేస్తుంది. రాజ్యాంగంలో 83,85 అధికరణాలు లోక్‌సభకు, 172, 174 అధికరణాలు శాసనసభకు సంబంధించిన ఏర్పాటు ముగింపు వంటి అంశాలలో

# సర్కారు 'సంతాన' నినాదాలు



హైదరాబాద్,ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ముఖ్యమంత్రులు చంద్రబాబు, స్టాలిన్ ఇటీవల చేసిన తప్పుడు వ్యాఖ్యలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించాయి. ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకోవాలన్న కుటుంబ సంక్షేమ పథకానికి సంబంధించి సుదీర్ఘకాల జాతీయ ఏకాభిప్రాయానికి వ్యతిరేకంగా ఇద్దరు ముఖ్యమంత్రులు వాస్తవానికి పెద్ద కుటుంబాలను, బహు సంతానాన్ని సమర్థిస్తున్నారు. చెన్నైలోని సామూహిక వివాహ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ 'మనకు 16 మంది పిల్లలు ఉండాలని చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది' అని ప్రకటించడం చర్చనీయాంశం అవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరైనా ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువ సంతానవంతులైతేనే అర్హులన్న నిబంధనతో చట్టం తీసుకు రావలసి ఉందని చంద్రబాబు బాహాటంగా సమర్థించడం కూడా వివాదమవుతోంది. చంద్రబాబు ప్రకటన తరువాతనే స్టాలిన్ కూడా అదే రీతిలో బహు సంతానానికి మద్దతు పలికారు. దేశంలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు ఒకవైపు అవసరాలు తీర్చవలసి ఉండగా, మరోవైపు అభివృద్ధి లక్షాలను సాధించడానికి తులనాత్మకంగా వ్యవహరించవలసిన పరిస్థితుల్లో ఆయా ప్రకటనలు ప్రారంభంలో దారుణమైన, ఇబ్బందికరమైన వాతావరణంతోపాటు ప్రాంతీయ సంకుచిత మనస్తత్వానికి దర్పణం పట్టాయి. మొత్తం సంతానోత్పత్తి రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేటు టిఎఫ్ఆర్) ను తగ్గించడానికి కొన్ని రాష్ట్రాలు ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు ప్రయత్నిస్తున్నాయి. ఆ రాష్ట్రాల్లో కోరుకున్న 2.1 స్థాయి కన్నా సంతాన రేటు ఎక్కువగానే ఉంది. ఆ రాష్ట్రాలు ప్రజారోగ్యం, విద్య, పోషకాహార స్థాయిల్లో తగిన వనరులను ఇంకా సమకూర్చుకోవలసి ఉంది. అప్పుడే సుస్థిర జనాభాకు తగిన సహాయం అందుతుంది. ఇది ఈ ప్రకటనల వెనుక ఉన్న వాస్తవ ప్రేరణలకు మనలను తీసుకు వస్తుంది. దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందడానికి మూడు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. కేంద్ర అధికార విభజనలో కానీ, నిధుల కేటాయింపులో కానీ ఉత్తరాది రాష్ట్రాలకు, వాటి జనాభా ప్రకారం ఎక్కువ సింహభాగం దక్కడం మొదటి కారణం. జనాభా గణన తరువాత నియోజక వర్గాల పునర్విభజన జరిగితే పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ సీట్లు లభించే అవకాశం ఏర్పడడం రెండో కారణం. వయోవృద్ధుల జనాభా విషయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో అసమతుల్యత కనిపించడం మూడో కారణం. రాజకీయంగా ఆధిపత్యం కలిగిన ఉత్తరాది గురించి ఉన్న భయాలు వెంటాడుతున్నాయి. పార్లమెంట్‌లో ఉత్తరాది ప్రాతినిధ్యం బాగా ఉన్నప్పటికీ, గత 77 ఏళ్లలో దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాది కన్నా చాలా వేగంగా అభివృద్ధి చెందాయి. ఈ విషయంలో దక్షిణాది పురోగతికి సంబంధించి ఉత్తరాది వలస కార్మికులకు దక్షిణాది రాష్ట్రాలు కృతజ్ఞతలు చెప్పాల్సి ఉంటుంది. వృద్ధ జనాభా పెరుగుతుండటంపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందడానికి రూఢిగా సమాధానం చెప్పాలంటే ఎక్కువ మంది సంతానాన్ని పొందడంపై ఆధారపడి లేదు. ఉత్తరాది నుంచి వచ్చే వలస కార్మికులకు దక్షిణాది రాష్ట్రాల్లో వసతి కల్పించడం పైనే అసలు సమస్య ఆధారపడి ఉంది. ఇప్పటికైనా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి రాష్ట్రాల అభిప్రాయాలను సేకరించే పనిలో 16 వ ఫైనాన్స్ కమిషన్ నిమగ్నమై ఉంది. దీని సిద్ధాంతం 2026 ఏప్రిల్ నుంచి అమలు లోకి రావచ్చు. ప్రస్తుత 15వ ఫైనాన్స్ కమిషన్ సూత్రం జనాభా పనితీరుకు సంబంధించి 12.5 శాతం వెయిటేజీ, జనాభా, ఏరియా విస్తీర్ణంపై చెరో 15 శాతం వంతున వెయిటేజీ, ఆదాయం తేడాల బట్టి 45% వెయిటేజీని పరిగణనలోకి తీసుకోవాలని యోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాల మధ్య పన్నుల నికర ఆదాయ పంపిణీ సరిగ్గా లేదన్న ఆరోపణలు గత కొంతకాలంగా వస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నుంచి దక్కుతున్నది కేవలం 2.5 శాతమే. అయినప్పటికీ జనాభా, ఏరియా, ఆదాయ వ్యత్యాసం ప్రాతిపదికన దక్షిణాది రాష్ట్రాలకు కోత విధించాలని కేంద్రం యోచిస్తోంది. ఇది వెనుకబడిన రాష్ట్రాలకు రాయితీ కానీ, ఆర్థిక నిర్వహణకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాలకు రివార్డు కానీ కాదు. 16వ ఫైనాన్స్ కమిషన్ ఈ అసమానతలను తక్షణం పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణ రాష్ట్రాల ఆందోళనలను కేంద్రం ఇప్పట్లో పరిష్కరిస్తుందన్న ఆశ కనిపించడం లేదు. అందుకనే 2026 నాటికి రాజ్యాంగ బద్ధంగా నిర్దేశించిన నియోజకవర్గ పునర్విభజన ప్రక్రియ చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గిపోవడమే కాక, నిధుల కేటాయింపులో కూడా తేడాలు వచ్చే అవకాశం కలుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. ఇందులో విపరీత పరిణామాలకు దారి తీయకుండా నియంత్రించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత.

# పొత్తులే కీలకం..

రాంచీ,ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న జార్ఖండ్‌లో ఇప్పుడు పాలక జెఎంఎం సహకారం లేకుండా ఏమీ చేయలేని స్థితిలోకి కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయింది. సర్ఫరాజ్ అహ్మద్, సుబోధ్ కాంత్ సహాయ్, ఫుర్కాన్ అన్సారీ, రాజేందర్ సింగ్, చంద్రశేఖర్ దూబే వంటి నాయకులతో కలకలలాడిన కాంగ్రెస్ ఇప్పుడు బలం తగ్గిఉంది. పొత్తులు ఫలించడం, సంక్షేమ పథకాలు సానుకూలించడంతోపాటు సోరెన్ అరెస్టుతో రాష్ట్రంలో వ్యక్తమైన సానుభూతి పాలక 'జెఎంఎం', 'ఇండియా' కూటమికి కలసి వస్తోందని భావిస్తున్నారు. బిజెపికి బయపడి, పార్టీ మార్పిళ్ల నుంచి కాపాడుకోవడానికి సిఎం తమ ఎంఎల్ఎలను రెండు మార్లు ఛత్తీస్‌గఢ్‌లో క్యాంపుల్లో పెట్టాల్సి వచ్చింది. ఇకపోతే 2019లో చేజారిన జార్ఖండ్‌ను తిరిగి పొందడానికి బిజెపి ఆదివాసీల మనసు గెలిచే సకల యత్నాలూ చేస్తోంది. జెఎంఎం బలంపై గట్టిగా దెబ్బకొట్టాలనే పట్టుదలతో పని చేస్తోంది. చేసిన తప్పును సరిదిద్దుకుంటున్న భావన జార్ఖండ్ ప్రజల్లోకి వెళ్లేలా, బిజెపి గెలిస్తేఊ డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి సాగుతుందని ప్రచారంలో చెబుతున్నారు. ఆదివాసీయేతర నాయకుడు రఘుబర్దాస్‌ని ముఖ్యమంత్రి చేసి ఆదివాసీల కోపానికి కారణమైనట్టు పార్టీ నాయకత్వం గ్రహించింది. అలాగే హేమంత్ సోరెన్ పై కేంద్ర దర్యాప్తు సంస్థల కేసు, అరెస్టుతో అది మరింతగా బలపడి, బిజెపి ఆదివాసీలకు వ్యతిరేకం అన్న భావన కలిగింది. అయితే ముర్మను రాష్ట్రపతిని చేయడం కొంత కలసి వస్తోంది. జార్ఖండ్‌లో ఏ కూటమినైనా.. అంతిమంగా పొత్తులే గట్టెక్కించాలి. ఏ ఒక్కరూ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగల ప్రజామద్దతు కూడగట్టే స్థితిలో లేరు. పొత్తుల్లో గెలిచి ప్రభుత్వాలు ఏర్పరచడం, విడిగా పోటీ చేసినపుడు ఓడి విపక్షంలో కూర్చోవడం.. ఈ అనుభవం ఇటు బిజెపి, అటు జెఎంఎం ఇద్దరికీ ఉంది. అందుకే పొత్తుల్ని ఖరారు చేసుకొని కూటమిగానే బరిలో దిగుతున్నారు. 81 స్థానాలున్న రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మ్యాజిక్ నంబర్ 41. పార్టీల మధ్య పొత్తుతో పాటు సామాజిక సమీకరణాలపైన దృష్టిపెట్టి, గెలుపే లక్ష్యం చేసుకుంటున్నారు. 2014లో విడిగా పోటీచేసి 25స్థానాలు గెలిచిన జెఎంఎం, కాంగ్రెస్‌లు 2019 ఎన్నికల్లో కలిసి పోటీచేసి 47 స్థానాలు గెలిచి, ప్రభుత్వం ఏర్పరిచారు. 2014లో ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఎజెఎస్‌యు)తో పొత్తు పెట్టుకొని 42 సీట్లు నెగ్గిన బిజెపి, 2019లో పొత్తులు బెడిసి 25 సీట్లకు పరిమితమైంది. ప్రభుత్వం పోయింది. 16శాతం జనాభాగా ఉన్న కుర్మీ మహతోల్లో పట్టున్న ఎజెఎస్‌యు కనీసం 14 అసెంబ్లీ సీట్లలో ప్రభావం చూపుతుంది. రాష్ట్రంలోని 7 జిల్లాలు, 20 సీట్లలో ప్రభావం గల ముస్లీంలు సుమారు 15 శాతంగా ఉన్నారు. ఒబిసి జనాభా 46శాతం ఉంది. అందుకే, బిజెపి(68), ఎజెఎస్‌యు(10), జెడి(యు)(2), ఎల్‌జెపి(1) కలిసి పోటీ చేయాలని సయోధ్యతో ఉన్నాయి. 'ఇండియా' కూటమిలోనూ సీట్ల పంపకాలు జరిగినా.. మూడు స్థానాల్లో మిత్రపక్షాల అభ్యర్థులే పరస్పరం పోటీలో ఉండే పరిస్థితి తలెత్తింది. జెఎంఎం (43), కాంగ్రెస్ (30), రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)(5), సిపిఐ-ఎంఎల్ (3) పార్టీలు కలిసి మొత్తం 81 స్థానాల్లో పోటీ చేయాలనుకున్నారు. కానీ, కాంగ్రెస్‌కు కేటాయించిన రెండు సీట్లలో ఆర్‌జెడి, సిపిఐ-ఎంఎల్‌కు కేటాయించిన ఒక చోట కాంగ్రెస్.. పొత్తులకు విరుద్ధంగా పోటీలో దిగుతున్నాయి. ఇన్ని సంక్లిష్టతల మధ్య జార్ఖండ్ గెలుపు ఎవరిని వరించనున్నదో నవంబరు 23 న తేలనుంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో 14లో 9 సీట్లు ఎన్‌డియే కూటమి గెలిచినప్పటికీ, 5 ఎస్‌టి రిజర్వుడు సీట్లలోనూ ఓడిపోయింది. అందుకే, ఈసారి గెలిస్తే ఆదివాసీయే ముఖ్యమంత్రి అనే సంకేతాలు ఇవ్వడానికి బిజెపి నాయకత్వం యత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయినా.. కొందరు ఆదివాసీ ముఖ్యనేతలను అసెంబ్లీ బరిలోకి దింపుతోంది. గీతాకోడ , సీతాసోరెన్ , అర్జున్ ముండా, చాంపయ్ సోరెన్ , జెఎంఎం మాజీ ఎంఎల్ఎ లోబిన్ ఎంబ్రామ్ వంటి వారు రంగంలో ఉన్నారు. ఆదివాసీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో 10, 12 అసెంబ్లీ సీట్లయినా గెలవాలనేది బిజెపి పట్టుదలగా కనిపిస్తోంది. పార్టీలోకి సరయురాయ్ తిరిగి రావడం కలిసొచ్చే అంశమని నాయకత్వం భావిస్తోంది. ఇదే అదనుగా కాంగ్రెస్ కూడా ఎదురుదాడి ప్రచారం చేస్తోంది. బిజెపి గిరిజన, ఆదివాసీ వ్యతిరేకి అనీ ప్రచారం చేస్తోంది. సిఎం హేమంత్ సోరెన్ అరెస్టయి జైల్లో ఉన్న సమయంలో ఆయన సతీమణి కల్పనా సోరెన్ విస్తృతంగా జనంలో తిరిగి కేంద్రానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. బొగ్గు రాయల్టీలు ఇవ్వకుండా, రాష్ట్రంపై వివక్ష చూపుతూ కేంద్రం సహకరించక పోవడమేకాక, ఆర్థికంగా జార్ఖండ్‌ను దెబ్బకొట్టే కుట్రలు చేస్తోందనీ చేసిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లింది. మయ్యా సమ్మాన్ యోజనతో పాటు రూ. 3584 కోట్ల మేర విద్యుత్ బిల్లుల మాఫీ, రూ.400 కోట్ల మేర రైతు వ్యవసాయ రుణ మాఫీ, డిసెంబర్ నుంచి స్టయిఫెండ్‌ను రూ.2500కి పెంచుతామన్న హామీతో ప్రజల్లో సానుకూలత పెరిగిందని భావిస్తున్నారు. కాంగ్రెస్, జెఎంఎం నుంచి ఎన్నికల ముందు బిజెపిలోకి వెళ్లిన పలువురు నేతలు తిరిగి రావడాన్ని ఓ సానుకూలాంశంగా 'ఇండియా' వర్గాలు భావిస్తున్నాయి.

# సినీ గ్లామర్ గట్టెక్కిస్తుందా?



చెన్నై: సినీ నటులు రాజకీయ ప్రవేశం చేసి రాజకీయ పార్టీలు ఏర్పాటు చేయడం లేదా ప్రముఖ రాజకీయ పార్టీలలో కీలక పాత్ర పోషించడం దక్షిణాదిన, ముఖ్యంగా తమిళనాడు నుండే ప్రారంభమైంది. సినీ నేపథ్యం గల కరుణానిధి ముఖ్యమంత్రి పదవి చేపట్టినా ఎంజి రామచంద్రన్ నుండే సినీ గ్లామర్ రాజకీయాలలో కీలకం కావ డం ప్రారంభమైంది. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టి రామారావు తెలుగు దేశం పార్టీ స్థాపించడంతో రాజకీయాల్లో సినీ నటుల ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. తాజాగా, తమిళనాడులో ప్రముఖ నటుడు తమిళగ వెట్రి కజగం (టివికె) పార్టీ స్థాపించడంతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. అయితే, సినీ రంగం నుండి రాజకీయాలలో కీలక శక్తిగా ఎదగాలని మరెందరో ప్రయత్నించి విజయం సాధించలేక పోవడం గమనార్హం. తమిళనాడులోనే విజయకాంత్, ఆంధ్ర ప్రదేశ్‌లో చిరంజీవి అందుకు ఉదాహరణలు. పవన్ కళ్యాణ్ సైతం ఓ దశాబ్దకాలం తర్వాత రాజకీయాలలో కొంత చోటు సంపాదించుకోగలిగారు. గత ఫిబ్రవరిలోనే తన రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి ప్రకటించిన విజయ్ ఇప్పుడు పార్టీని అధికారికంగా ప్రారంభించి, 2026 ఎన్నికలు లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. తన రాజకీయ ప్రయాణం గురించి స్పష్టమైన అవగాహనతోనే విజయ్ ముందడుగు వేస్తున్నట్లు ఆయన ప్రసంగం వెల్లడి చేస్తుంది. ఇప్పుడే ఎన్నికల అనంతరం సర్దుబాట్ల గురించి, సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు గురించి ప్రస్తావించారు. ఒక వంక బిజెపిని, మరోవంక అధికారంలో ఉన్న డిఎంకెని తన రాజకీయ ప్రత్యర్థులుగా గుర్తించినట్లు ఆయన ప్రసంగ ధోరణి వెల్లడి చేస్తుంది. అంటే, డిఎంకె వ్యతిరేక ఓటర్లను, ఒక విధంగా ఎఐఎడిఎంకె మద్దతుదారులను ఆకట్టుకొనే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఆ విధంగా చేయడం ద్వారా డిఎంకె వ్యతిరేక ఓట్లను చీల్చి, డిఎంకె తన స్థానాన్ని సుస్థిరం చేసుకొనేందుకు పరోక్షంగా సహకరించినట్లు అవుతుందని అన్నాడిఎంకె వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. అప్పట్లో ఎంజిఆర్, ఆ తర్వాత ఎన్‌టిఆర్ రాజకీయ పార్టీలను స్థాపించిన సమయంలో ఓ రకమైన 'రాజకీయ శూన్యత' నెలకొంది. అధికార పార్టీ పట్ల ప్రజలలో వ్యతిరేకత పెరుగుతూ ఉండటం, అధికార పార్టీని దీటుగా ఎదుర్కొనే ప్రతిపక్షం లేకపోవడం వారికి కలిసి వచ్చింది. అటువంటి పరిస్థితులు ఇప్పుడు తమిళనాడులో లేవని చెప్పాలి. చిరంజీవి సైతం ఇటువంటి సమయంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారాజ్యం పార్టీని ఏర్పాటు చేసి విజయం సాధించలేకపోయారు. అదే విధంగా పవన్ కళ్యాణ్ కూడా జనసేనను స్థాపించి 2019 ఎన్నికలలో ఒక్క సీటు కూడా గెల్చుకోలేకపోయారు. తమిళనాడులో గతంలో విజయకాంత్ సైతం ఇటువంటి పరిస్థితులలోనే విజయం సాధించలేకపోయారు. విజయ్ కన్నా ఎక్కువ ప్రజాకర్షణ ఉన్నప్పటికీ చెప్పుకోదగిన ఫలితం సాధింపలేక పోయారు. తమిళనాడులోనే కమల్ హాసన్ సైతం సొంతంగా పార్టీ ప్రారంభించి బొక్కబోర్లాపడ్డారు. రజనీకాంత్ పార్టీ ప్రారంభానికి అంతా సన్నాహాలు చేసుకొని కూడా చివరి నిమిషంలో వెనుకడుగువేశారు. వీరందరికి మించిన మద్దతును విజయ్ సమకూర్చుకోగలరా? పైగా రాజకీయ లక్ష్యాలు, విధానాలు పట్ల స్పష్టమైన అవగాహన ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమిళనాడులో గతంలో జయలలిత విజయం సాధించినా ఆమె ఎంజి రామచంద్రన్ ప్రోత్సాహంతో రాజకీయాలలో నిలదొక్కుకున్నారు. ఆ తర్వాత ఆయన మరణంతో ఏర్పడిన ఆ శూన్యాన్ని ఆమె భర్తీ చేయగలిగారు. సినీనటుల రాజకీయ సభలకు విశేషంగా జనం హాజరైనప్పటికీ వారిని ఓటర్లుగా మార్చుకోవడం అంత తేలిక కాదని గతంలోని పలువురి అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. సినీ నటులు ఎక్కువగా తమ అభిమానులపై ఆధార పడుతూ ఉంటారు. అయితే అభిమానుల పట్ల సామాజికంగా చెప్పుకోదగిన గౌరవ మర్యాదలు ఉండవు. వారిని 'గాలికి తిరిగేవారు' గా వాటి కుటుంబ సభ్యులే భావిస్తూ ఉంటారు. అందుకనే ఓటర్లపై నిర్ణయాత్మక ప్రభావం చూపలేరని చిరంజీవి, కమల్ హాసన్, పవన్ కళ్యాణ్ వంటి వారి అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. 2008లో తిరుపతి నుండి తన లక్షలాది మంది అభిమానులు, ప్రజల సమక్షంలో తన 'ప్రజారాజ్యం' పార్టీని ప్రారంభించిన గొప్ప నటుడు చిరంజీవికి నిజానికి ఈరోజు తమిళనాడులో విజయ్ కంటే ఎక్కువగా ప్రజాదరణ ఉంది. కానీ ఎపి అసెంబ్లీ ఎన్నికల్లో చిరంజీవి పార్టీ కేవలం 18 ఎంఎల్ఎలను మాత్రమే గెలుచుకోగలిగారు. చివరకు పార్టీని ప్రారంభించిన మూడేళ్లలోనే ఎన్నికల ప్రచారంలో ఏ కాంగ్రెస్ పార్టీపై దాడికి పాల్పడ్డారో అదే కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు. కాబట్టి, ఎన్నికల్లో, ఓటింగ్ సరళిలో ప్రజాదరణ,- కీర్తి-, గ్లామర్ వనరులు మాత్రమే ప్రభావం చూపవని గ్రహించాలి. అయితే 'పవర్ స్టార్' పవన్ కళ్యాణ్ ఎంతో సహనం ప్రదర్శించడం ద్వారా, పట్టుదలతో జనసేన పార్టీని 2024 ఎపి అసెంబ్లీ ఎన్నికలలో అద్భుతమైన విజయం వైపు నడిపించగలిగారు. 2008లో తన సొంత సోదరుడు చిరంజీవి పార్టీ యువజన విభాగం చీఫ్‌గా ఉన్న రోజుల నుండి ఆయన చాలా కష్టపడ్డారు. ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన తర్వాత అతను 2014 లో తన స్వంత 'జనసేన' పార్టీని ప్రారంభించారు. ఇటీవలి ఎన్నికల వరకు అనేక రాజకీయ, సంస్థాగత సవాళ్లు ఎదుర్కొన్నారు. పవన్ కళ్యాణ్ 2019 ఎన్నికల్లో పోటీ చేసిన రెండు అసెంబ్లీ స్థానాల్లోనూ ఓడిపోయారు. ఒక దశలో కమ్యూనిస్టులతో కలిసి, ఆ తర్వాత బిజెపిలోకి వెళ్లి, రాష్ట్ర సమస్యలపై బిజెపితో దోస్తీ మొదలైన తర్వాత మళ్లీ బయటకు వచ్చారు. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి కాగలిగారు. సరైన పొత్తు, సర్దుబాటు కారణంగా ఆయనకు విజయాన్ని అందించడంతో ఆయన రాజకీయ వైఖరిని ఇప్పుడు చాలా మంది కొనియాడుతున్నారు. పైగా, ఇప్పుడు తమిళనాడులో డిఎంకె ప్రభుత్వ పాలనపట్ల వెంటనే గద్దె దించాలన్న ఆగ్రవేశాలు ప్రజలలో ఉన్న సంకేతాలు లేవు. విజయ్ జరిపిన తొలి బహిరంగసభను చూస్తే అంత 'ఏకపాత్రాభినయం' మాదిరిగా ఉంది. ముందుగా క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడం పట్ల దృష్టి సారించాలి. బిజెపి, డిఎంకెలను తన రాజకీయ ప్రత్యర్థులనే సంకేతాలు ఇచ్చినా వాటి పేర్లను ప్రస్తావించిన దాఖలాలు లేవు. పైగా, సైద్ధాంతికమైన నిబద్ధతను స్పష్టంగా ప్రదర్శింపలేకపోయారు. ఎంజిఆర్, ఎన్‌టిఆర్ రాజకీయ ప్రవేశానికి ముందుగానే తన చిత్రాల ద్వారా ప్రజలకు సందేశాలు ఇచ్చే ప్రయత్నం చేశారు. సామాజిక సమస్యలపై తమ చిత్రాల ద్వారా గొంతు విప్పే ప్రయత్నం చేశారు. కానీ విజయ్ సినిమాలు వ్యాపార ధోరణిలో ఉండటం తప్ప అటువంటి సందేశాత్మక చిత్రాలు పెద్దగా లేవు. కేవలం సినీ గ్లామర్‌తో మాత్రమే రాజకీయాలలో నిలదొక్కుకోవడం అందరికీ సాధ్యం కాదు. అమితాబ్ బచ్చన్ వంటి వారే ఒకసారి లోక్‌సభకు ఎన్నికై, ఆ తర్వాత రాజకీయాలకు సరిపోనని వెనుకడుగు వేశారు. మొన్నటి వరకు బిజెపి కూటమిలో కీలకంగా వ్యవహరించిన ఎఐఎడిఎంకె తమిళ ప్రజలు ఆ పార్టీని ఆదరింపరని గ్రహించి ఆ పార్టీకి దూరంగా జరిగింది. డిఎంకె మొదటి నుండి కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమిలో కీలకంగా వ్యవహరిస్తున్నది. అందుకనే విజయ్ అనుసరించే 'బిజెపి వ్యతిరేక ధోరణి' రాజకీయంగా పెద్దగా ప్రయోజనం చేకూర్చే అవకాశం లేదు. మన దేశంలో ప్రతి రాజకీయ పక్షం కూడా కొన్ని బలమైన సామాజిక వర్గాలు లేదా మైనారిటీల మద్దతుపై ఆధారపడుతున్నాయి. కానీ విజయ్‌కు అటువంటి సౌలభ్యం కనిపించడం లేదు. ఆయన కేవలం తన గ్లామర్ మీదనే ఆధారపడుతున్నట్లు కనిపిస్తున్నది. ఆయన అవినీతి గురించి ప్రస్తావించినా నేడు ప్రతి పార్టీ అదే భాషలో మాట్లాడుతున్నది.

# శ్రీశైలానికి పోటెత్తిన భక్తజనం..

శ్రీశైలం : కార్తీక మాసోత్సవాలు శ్రీశైల క్షేత్రంలో ఘనంగా జరుగుతున్నాయి. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చిన భ్రమరాంబ దేవి, మల్లికార్జున స్వామివారలను దర్శించుకున్నారు. కార్తీక తొలి సోమవారం సందర్భంగా ఆదివారమే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో శ్రీగిరులు సందడిగా మారాయి. వరుసగా రెండురోజులు సెలవులు రావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరాది రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తడంతో శ్రీగిరి పురవీధులు కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శనాలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. స్వామి అమ్మవార్ల ఉభయ దేవాలయాల్లో కేవలం అలంకార దర్శనం మాత్రమే ఉన్నందున దర్శనానికి గంట సమయం పడుతుందని ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలనుంచి అన్నదాన మహాప్రసాదాన్ని అందుబాటులో ఉంచారు. క్షేత్ర పరిధిలోని పరివార ఆలయాలు పర్యాటక కేంద్రాలతోపాటు ఉద్యానవనాల్లో చిన్నారులు సందడి చేశారు. పలువురు భక్తులు కృష్ణానదిలో స్నానాలు చేసి కార్తీక దీపాలను వెలిగించి.. నదీమాతకు పూజలు చేశారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో ఆకాశ దీపాన్ని వెలిగించారు.

మత్తు పదార్థాలకు అనుమతి లేదు

శ్రీశైల క్షేత్రానికి దర్శనార్థం వచ్చే భక్తులు తమ వాహనాల్ల ఎలాంటి మత్తు పదార్థాలను తీసుకురావొద్దని ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్న హెచ్చరించారు. టోల్‌గేట్ వద్ద ప్రతినిత్యం వాహన తనిఖీలు జరుగుతూనే ఉంటాయని తెలిపారు. దేవస్థాన నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎండోమెంట్ యాక్ట్ ప్రకారం వాహనాలను సీజ్ చేసి.. కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

# డేంజర్ బెల్స్.. ఢిల్లీలో 400 మార్క్‌ను దాటిన గాలి నాణ్యత



దేశ రాజధాని ఢిల్లీలో గాలి కాలుష్యం (వాయు కాలుష్యం) డేంజర్ బెల్స్ మోగుతోంది. కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతు గాలి నాణ్యత పూర్తిగా క్షీణించిపోతోంది. సోమవారం రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత అధ్వానస్థితికి చేరింది. పలు ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (వాయు నాణ్యత సూచిక) 400 మార్క్‌ను దాటేసింది. ఏక్యూఐ 400 దాటితే అది ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.కేంద్ర కాలుష్య మండలి (సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్) ప్రకారం.. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఆనంద్ విహార్‌లో 433, వజీర్‌పూర్‌లో 414, జహంగీర్‌పురిలో 413, రోహిణి ప్రాంతంలో 409, పంజాబీ బ్యాగ్‌లో 404గా గాలి నమోదైంది. పలు ప్రాంతాల్లో 400 కంటే ఎక్కువ స్థాయిల్లో ఏక్యూఐ నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డిస్‌సెట్.ఆగ్రా, నోయిడాతోపాటు ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో దట్టంగా పొగ కమ్ముకుంది. కాలుష్యం ధాటికి తాజ్‌మహల్ కనిపించకుండా పోయింది. గత 10 నుంచి 12 రోజుల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇక యమునా నది నురగలు కక్కుతున్నది. పెద్దమొత్తంలో నురగ నదిపై ప్రవహిస్తున్నది. కాగా రానున్న మూడు రోజుల్లో రాజధాని పొగ మంచు కమ్మేసే అవకాశం ఉంది.భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. గాలి వేగం గంటకు 10 కిమీ కంటే తక్కువగా ఉందని.. ఇది పరిస్థితిని మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉందని తెలిపింది.కాగా, దేశ రాజధానిలో దీపావళి రాత్రి అధిక స్థాయిలో వాయు కాలుష్యం నమోదైంది. పలు ప్రాంతాల్లో ఏక్యూఐ రీడింగ్‌లు గరిష్ఠ సాయి 999కి చేరాయి. ఏక్యూఐ 507 పాయింట్లకు చేరితే ప్రమాదకర స్థాయి కాలుష్యంగా పరిగణిస్తారు. ఈ గాలి పీల్చితే ప్రజలకు శ్వాసకోశ సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు గాలి కాలుష్యానికి తోడు ఢిల్లీ అంతటా దట్టమైన పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విషవాయువును పీల్చుకుంటున్న ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 వరకు ఉంటే ప్రమాదకర స్థాయిలో పరిగణిస్తారు. అయితే, గత కొంతకాలంగా ఢిల్లీలో గాలి ప్రమాదకరంగా మారుతున్న విషయం తెలిసిందే. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడానికి తోడు.. మంచు రాజధానిని కమ్మేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య పాలకులు ఎన్ని చర్యలు నియంత్రణలో ఉన్నా ఫలితం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ కారణంగా నగర వాసులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తోంది.

# మరాఠీల ఓట్ల కోసం మూడు సేనల పోరు

ముంబై: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో మరాఠీల ఓట్ల కోసం మూడు సేనలు పోటీ పడుతున్నాయి. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఆధ్వర్యంలోని శివసేన (యూబీటీ), రాజ్ ఠాక్రే నాయకత్వంలోని మహారాష్ట్ర నవ నిర్మాణ సేన మరాఠీల మనసులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీంతో ఈ ఓట్లు మొదటిసారి మూడుగా చీలిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజ్ ఠాక్రే పార్టీ ప్రభావం ఉద్ధవ్ నేతృత్వంలోని పార్టీపై ప్రతికూలంగా పడవచ్చునని విశ్లేషకులు చెప్తున్నారు. మరాఠీల ఓట్లు చీలడం వల్ల ఎక్కువగా లాభపడేది బీజేపీయేనని అంటున్నారు.

రాజ్ ఠాక్రే రంగ ప్రవేశంతో..

2009 లోక్ సభ ఎన్నికల్లో రాజ్ ఠాక్రే పార్టీ వల్ల ముంబై, థాణే, నాసిక్ ప్రాంతాల్లోని చాలా స్థానాల్లో బీజేపీ–శివసేన కూటమికి గట్టి దెబ్బ తగిలింది. ఫలితంగా కాంగ్రెస్ లాభపడింది. రాజ్‌కు కనీసం ఒక స్థానమైనా దక్కలేదు. ప్రస్తుత ఎన్నికల్లో శివసేన (యూబీటీ),ఎన్‌సీపీ (శరద్‌పవార్), కాంగ్రెస్ మహా వికాస్ అఘాఢీగా పోటీ చేస్తున్నాయి.బీజేపీ,శివసేన (ఏక్‌నాథ్ షిండే),ఎన్‌సీపీ (అజిత్ పవార్) పార్టీలు మహాయుతిగా పోటీ చేస్తున్నాయి. ముంబై, దాని పరిసర నియోజకవర్గాల్లో శివసేన,శివసేన (యూబీటీ) పోటీ పడుతుండగా,ఆ స్థానాల నుంచే ఎంఎన్ఎస్ కూడా తన అభ్యర్థులను బరిలో దించింది.కొంత కాలంపాటు ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉన్న రాజ్ ఠాక్రే ప్రస్తుతం సర్వశక్తులు ఒడ్డి పోరాడుతున్నారు. తన కుమారుడు అమిత్‌ను బరిలో దించారు.



మహిమ్, వర్లిలో పోటాపోటీ

మహిమ్ నియోజకవర్గంలో ఈ మూడు సేనల మధ్య ముక్కోణ పోటీ హోరాహోరీగా జరగబోతున్నది. అమిత్ ఠాక్రే (ఎంఎన్ఎస్), సదా సర్వంకర్ (శివసేన), మహేశ్ సావంత్ (శివసేన–యూబీటీ) ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. అదే విధంగా వర్లిలో కూడా రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. ఇక్కడి నుంచి ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే (శివసేన–యూబీటీ), సందీప్ దేశ్‌పాండే (ఎంఎన్ఎస్ సీనియర్ నేత), మిలింద్ దేవ్‌రా (శివసేన) పోటీ చేస్తున్నారు.అమిత్, ఆదిత్య సునాయాసంగా గెలిచే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# బీజేపీలో ఎమ్మెల్సీ టికెట్ల లొల్లి...

హైదరాబాద్, తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది? త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ టికెట్లపై లొల్లి మొదలైందా? ఎందుకు సునీల్ బన్సల్ హైదరాబాద్‌కు రావాల్సి వస్తోంది? అధిష్టానికి ఫిర్యాదు వెనుక అసలేం జరిగింది? ఇంకా లోతుల్లోకి వెళ్దాం.తెలంగాణ బీజేపీలో ఎమ్మెల్సీ ఎన్నికల చిచ్చు మొదలైంది. మూడు సీట్ల కోసం పార్టీలో గట్టి పోటీ నెలకొంది. కొంతమంది కార్పొరేట్లు వీటిపై ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టికెట్ల పంచాయితీ తెగకపోవడంతో ఢిల్లీ నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ రానున్నారు.తెలంగాణ మూడు ఎమ్మెల్సీ సీట్లకు మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. అందులో రెండు టీచర్, ఒకటి గ్రాడ్యుయేట్ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. అభ్యర్థుల ఎంపికపై కమిటీలు వేయడంతో కసరత్తు మొదలైపోయింది. అయితే అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారింది. ఎక్కువ మంది రేసులో ఉండడంతో ఎవరికి టికెట్ ఇవ్వాలన్న దానిపై తర్జనభర్జన పడుతోంది.కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిపై భిన్నాభిప్రాయాలు మొదలైపోయాయి ఆ ప్రాంతానికి చెందినవారికి కాకుండా హైదరాబాద్ వ్యక్తికి టికెట్ ఇవ్వడాన్ని కొందరు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ వ్యవహారంపై తెలంగాణ బీజేపీ ఉపాధ్యాయ సంఘం, ఏబీవీపీ సంఘాలతోపాటు కొందరు నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.అంతేకాదు ఓ అడుగు ముందుకేసి ప్రధాన కార్యదర్శి బీఎస్ సంతోష్‌కు ఫిర్యాదు చేసినట్టు అంతర్గత సమాచారం. స్థానిక నేతలుండగా హైదరాబాద్‌కి చెందిన ఓ స్కూల్ మేనేజ్‌మెంట్ అధినేతకు



టికెట్ ఇవ్వడాన్ని తప్పుబడుతున్నారట.ఇది ముమ్మాటికీ సంఘ్ నిబంధలకు విరుద్ధమని ఆర్గ్యుమెంట్ చేస్తున్నారట. ఒకవేళ స్కూల్ మేనేజ్‌మెంట్ అధిపతికి టికెట్ ఇస్తే.. ప్రచారం చేయమని తెగేసి చెప్పేశారట. దీంతో ఏం చెయ్యాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో పడింది ఎమ్మెల్సీ ఎంపిక కమిటీ.ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్ రానున్నారు పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్. ఈ క్రమంలో పార్టీ నేతలు, కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం కావాలని నిర్ణయించుకున్నారట. తొలుత విడివిడిగా భేటీ కానున్నారు. ఆ తర్వాత అందరితో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆ పార్టీ వర్గాల మాట. దీంతో టికెట్లపై క్లారిటీ రావచ్చని అంటున్నారు నేతలు.

# ఒవైసీ దెబ్బకు బీఆర్ఎస్ క్లోజ్?




హైదరాబాద్,MIM అధినేత అసదుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యలతో బీఆర్ఎస్ నేతల్లో టెన్షన్ మొదలైంది. ఆయన నోరు విప్పితే ఏం మాట్లాడుతారో? ఏం బయట పెడుతారో అని కారు పార్టీ నేతలు కలవరపడుతున్నారట. అహంకారమే బీఆర్ఎస్ ఓటమికి కారణమని.. వారి జాతకం మొత్తం తన దగ్గర ఉందన్నారు అసదుద్దీన్. MIM అధినేత దగ్గర ఉన్న జాతకం ఏంటో అని పొలిటికల్ సర్కిల్లో జోరుగా చర్చ జరుగుతుంది. వాటిని బయట పెట్టాలని డిమాండ్స్ వినిపిస్తున్నాయి. ఆ స్టోరీ ఏంటో చూద్దాం.నోరు విప్పితే బీఆర్ఎస్ పార్టీకి ఇబ్బంది అని హెచ్చరించారు MIM అధినేత అసదుద్దీన్ ఒవైసీ. బీఆర్ఎస్ జాతకం మొత్తం తన దగ్గర ఉందని.. మూసీ ప్రక్షాళనకు ప్రణాలికలు చేసింది మీరు కాదా అని హెచ్చరించారు ఒవైసీ. గత పదేళ్లలో మూసీ సుందరీకరణ పేరుతో ఎటువంటి అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. 10 యేండ్లు పాటు అధికారంలో ఉండే సరికి నేతల్లో అహంకారం పెరిగిందని.. ప్రజలను పట్టించుకోలేదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. 2023 ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ లో బీఆర్ఎస్ కి అన్ని సీట్లు రావడానికి కారణం MIM అని వ్యాఖ్యానించారు. అహంకారంతోనే బీఆర్ఎస్ పార్టీ ఓడిందని.. అవసరమైతే వారి జాతకం మొత్తం బయట పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలతో గులాబీ నేతల్లో టెన్షన్ మొదలైంది. రహస్య ఒప్పందాలు అన్ని బయటపెడితే పరిస్థితి ఏంటో అని ఆత్మ పరిశీలనలో కారు పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారట. ఇప్పటికే గడిచిన 10 ఏళ్లలో చేసిన అక్రమాలు అన్ని ఒక్కొకటి బయటపడుతున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్ నేతలను కలవరపెడుతున్నాయి.ఇక కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై త్వరలోనే కమిషన్ నివేదిక ఖరారు చేసి ప్రభుత్వానికి ఇవ్వనుంది. ఇప్పటికే తప్పు చేసిన వారిని వదిలేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలానే విద్యుత్ కొనుగోలు విషయంలో కూడా భారీగా అవకతవకలు జరిగాయని కమిషన్ నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి ఇచ్చింది. దీని పైన త్వరలోనే కేబినెట్ మీటింగ్ లో చర్చించి అవసరం అయితే అసెంబ్లీ సమావేశాల్లో చర్చ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. నివేదిక ఆధారంగా చర్యలు తప్పవని.. మాజీ సీఎం కేసీఆర్, అప్పటి విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు.మరోవైపు ప్రతిపక్ష పాత్ర 100 శాతం నిర్వర్తిస్తాం అని చెప్పిన బీఆర్ఎస్.. ఆ దిశగా అడుగులు వెయ్యడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాం హౌస్ కే పరిమితమవుతున్నారని విమర్శను మూటగట్టుకుంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎక్కడ కనిపించక పోవడం ఆ వాదనలను మరింత బలపరుస్తున్నాయి. ప్రతిపక్ష నేత హోదాలో కృష్ణా జలాల నీటి వాటాపై ఒకసారి నల్లగొండలో బహిరంగ సభ.. తరువాత కరీంనగర్ సభ.. ఎండిన పంట పొలాలను పరిశీలించేందుకు బస్సుయాత్ర.. బడ్జెట్ సమావేశాల్లో ఒకసారి మాత్రమే కేసీఆర్ బయట కనిపించారు. మిగిలిన సమయం అంతా ఆయన ఫాం హౌస్ కే పరిమితమవుతున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆరే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.అయితే వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ విఫలం అయ్యారని విమర్శ మూటగట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్క సీటు గెలిపించుకోలేకపోయారని అంటున్నారు. అంతే కాకుండా రీసెంట్ గా కేటీఆర్ బావమరిది పాకాల రాజు ఫామ్ హౌస్ పార్టీ ఇష్యూ ఫుల్ హాట్ టాపిక్ అయ్యింది. పార్టీలో పెద్ద ఎత్తున విదేశీ మద్యం, కేసినో కాయిన్స్ బయటపడడంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఆ కేసులో కేటీఆర్ బావమరిది పోలీసుల విచారణకు సైతం హాజరయ్యారు. దీంతో మూలిగే నక్క మీద తాటి పండు పడినట్లుగా.. ఇప్పటికే వరుస ఓటములతో సతమవుతున్న గులాబీ పార్టీకి.. ఫాం హౌస్ పార్టీ ఇష్యూ మరింత తలనొప్పులు తెచ్చిందని అభిప్రాయపడుతున్నారట.అసలు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన బీఆర్ఎస్ ని..ఒవైసీ వ్యాఖ్యలు మరింత కలవరపెడుతున్నాయని జోరుగా చర్చ జరుగుతోంది. అసదుద్దీన్ ఆధారాలను బయటపెడితే కారు పార్టీ పరిస్థితి ఏంటని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఒవైసీ బీఆర్ఎస్ జాతకాన్ని బయటపెట్టాలని కూడా పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# లిక్కర్తోనే...జబర్దస్త్



హైదరాబాద్,తెలంగాణలో మద్యం ధరలను సవరించేందుకు ఆబ్కారీ శాఖ కసరత్తు చేస్తోంది. ఏపీలో రేట్లతో సమానం చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. దీని కోసం త్వరలోనే బీరుపై ?20, లిక్కర్‌పై క్వార్టర్‌కు ?20 నుంచి ?70 దాకా రేట్లు పెంచే ఆలోచనలో అధికారులున్నారు. ధరలు పెంచడం ద్వారా ప్రతి నెలా ?1000 కోట్లు అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.రాబోయే అయిదు నెలల్లో మరో 5 వేల కోట్ల రూపాయలు అదనంగా ఖజానాకు చేరే అవకాశం ఉంది. దీంతో ఎక్సైజ్ శాఖ నుంచి ఏడాదికి ?40 వేల కోట్లకు పైగానే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

పెరుగుతున్న గుడుంబా కేసులు..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఎక్సైజ్ శాఖలో ఆదాయం రావడం లేదు. రాష్ట్రంలో గుడుంబాతో పాటు అక్రమ మద్యం తయారీ, సరఫరా, విక్రయాలు పెరిగాయని ఆ శాఖ ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 6 నెలల్లో నమోదు చేసిన కేసుల సంఖ్య స్పష్టం చేస్తోంది.గత ఏడాది మొదటి ఆరు నెలల్లో 9,108 గుడుంబా కేసులు నమోదు కాగా, ఈ ఏడాది అదే సమయంలో 18,826 కేసులు నమోదు అయ్యాయి. అంటే రెట్టింపు కేసులు నమోదు కావడంతో పాటు పది వేల మందికి పైగానే గుడుంబా కేసుల్లో అరెస్టు చేశారు

అనుకున్న ఆదాయం రాలే..

అక్రమ మద్యం సరఫరా, గుడుంబా తయారీని అరికట్టేందుకు ఆబ్కారీ శాఖ అధికారులు కఠినంగా ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇదే సమయంలో ఈ ఆర్థిక సంవత్సరానికి ఎక్సైజ్ శాఖ ద్వారా వ్యాట్, ఎక్సైజ్ డ్యూటీ ద్వారా ?36 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 6 నెలల్లో ఆబ్కారీ శాఖకు వచ్చిన ఆదాయం ఎక్సైజ్ డ్యూటీ ద్వారా ?9,493 కోట్లు, వ్యాట్ ద్వారా మరో ?8,040 కోట్లు వచ్చింది. అంటే ఇప్పటి వరకు ఆ రెండింటి ద్వారా దాదాపు ?17,533 కోట్ల రాబడి వచ్చినట్లు ఆబ్కారీ శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. మిగిలిన ఆరు నెలల్లో ఇదే మొత్తం వస్తుందని అంచనా వేస్తే, ఈ ఆర్థిక సంవత్సరం ?35,000 కోట్లకు మించే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.ధరలను సవరించే అవకాశం..ఇటీవల వాణిజ్య పన్నులు, ఆబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీతో సమీక్ష చేసిన సీఎం రేవంత్ రెడ్డి రాబడులను పెంచే ఆలోచనలతో ముందుకు వెళ్లాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే గుడుంబా, అక్రమ మద్యం నిరోధానికి కఠిన చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాలు అదే పనిలో ఉన్నట్లు ఆబ్కారీ శాఖ అధికారులు చెబుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో మద్యం ధరలు అధికంగా ఉన్నట్లు విమర్శలు రావడంతో గత ప్రభుత్వం 2023 మే నెలలో బీరుపై ?10, లిక్కర్‌పై ?20 లెక్కన తగ్గించింది. ఆదాయం పెంచాలని రేవంత్ సర్కారు భావిస్తుండడంతో గతంలో తగ్గించిన ధరలతో పాటు మరికొంత అదనంగా చేర్చి ధరలు పెంచాలని ఆబ్కారీ శాఖ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో మద్యం ధరలను వీలైనంత త్వరగా సవరించాలని ఎక్సైజ్ శాఖ యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.లిక్కర్ ధరల పెంపు ఇలా..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీరు ధర ?170 నుంచి ?200 వరకు ఉండగా, ఇక్కడ ?150 నుంచి ?180 వరకు ఉన్నట్లు మందుబాబులు చెబుతున్నారు.తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో బీరుపై కనీసం ?20 పెంచాలని యోచిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా లిక్కర్‌పై మూడు, నాలుగు బ్రాండ్లపై క్వార్టర్‌పై ?20 ధర పెంచనుండగా, మిగిలిన బ్రాండ్ల క్వార్టర్‌పై ?50 నుంచి ?70 వరకు పెంచనున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఫుల్ బాటిల్‌పై ?80ల నుంచి ?300 వరకు పెంచాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఇలా పెంచినట్లయితే ఇప్పుడున్న ధరల కంటే 15 శాతం నుంచి 20 శాతానికి పైగా ధరలు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఖజానాకు దండిగా ఆదాయం..

వాస్తవానికి రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్‌లు, క్లబ్‌లు, పబ్‌లు అన్నింటి ద్వారా రోజుకు సగటున ?100 కోట్లకు పైగా విలువైన మద్యం అమ్ముడుపోతోంది. అంటే నెలకు సగటున ?3000 కోట్ల నుంచి ?3500 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఇప్పుడు ధరలు సవరించినట్లయితే ప్రతి నెలా దాదాపు రూ.వెయ్యి కోట్ల వరకు అదనంగా రాబడి పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రాబోయే 5 నెలల్లో ఇప్పుడున్న అంచనా కంటే మరో ?ఐదు వేల కోట్లు అదనంగా ఖజానాకు చేరే అవకాశం ఉందని ఆబ్కారీ శాఖ ఉన్నతాధికారులు లెక్కలేస్తున్నారు. అధికారుల అంచనా మేరకు ఆదాయం వచ్చినట్లయితే ఎక్సైజ్ శాఖ నుంచి ?40 వేల కోట్లకుపైగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# రెండో రాజధానిగా వరంగల్ అభివృద్ధి

వరంగల్ : వరంగల్ మ హా నగరాన్ని రెండవ రాజధానిగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించా రు. నగర మేయర్ గుండు సుధారాణి, ఎంఎల్‌సి బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు నాయిని రా జేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు, వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి. ప్రావీణ్యతో కలిసి వరంగల్ నగరంలోని భద్రకాళి బండ్ సుందరీకరణ పనులు, భద్రకాళి చెరువు బొంది వాగు వరద నివారణ పనులు, భద్రకాళి మా డవీధులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సం దర్భం గా మంత్రి మాట్లాడుతూ..భద్రకాళి చెరువు ను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులలో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారుల ను ఆదేశించా రు. భద్రకాళి చెరువు బొంది వాగు వరద నివారణకు ప్రభుత్వం రూ.158 కోట్లు మంజూరు చేసిందని, బొంది వాగు నాలా, భద్రకాళి నాలా, భద్రకా ళి క్యాచ్‌మెంట్ ఏరియాలలో చేపట్టే వరద నివారణ కు సంబంధించిన అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలించారు. ఆయా వివరాలు అధికారులను అడిగి తెలుసుకుని సమర్థవంతంగా ఆయా పనులు నిర్వహించేందుకు తగిన సూచనలు చేశారు.భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడు తూ.. క్రీస్తుపూర్వం 600 ఏళ్లక్రింద నిర్మించిన భద్రకాళి అమ్మవారి ఆలయానికి ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉందని, ఉమ్మడి కరీంనగర్,ఖమ్మం, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుండి భక్తులు వస్తారని, ఈ ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ పట్టణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి రెండవ రాజధానిగా అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. వరంగల్ సమగ్రాభివృద్ధి చర్యల్లో భాగంగా భక్తుల అభిరుచికి అనుగుణంగా భద్రకాళి ఆలయం, మాడవీధులను ఆగమ శాస్త్రం ప్రకారం అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆలయాన్ని అనుకుని ఉన్న చెరువును అభివృద్ధి చేయడానికి పరిశీలించామని అన్నారు. సుమారు 380 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు పూడిక పేరుకుపోయి, చెరువు లోతు తగ్గి, సమాంతరంగా మారడం కారణంగా నీరు నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని,



వెంటనే చెరువు పూడికతీతకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన వెంటనే వరంగల్ ప్రాంతవాసులకు ఎయిర్‌పోర్టు సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఓఆర్ఆర్, ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటుతో పాటు రాబోయే 30 సంవత్సరాల వరకు నగర ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, అండర్ డ్రైనేజీ, ఎలక్ట్రిఫికేషన్ తదితర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలను తయారు చేశామని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళోజీ నారాయణరావు కళా క్షేత్రాన్ని, పట్టణానికి సంబంధించిన మౌలిక వసతుల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, కుడా పిఓ అజిత్ రెడ్డి, జిడబ్ల్యుఎంసి ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు భీంరావు, సంతోష్ బాబు, సీతారాం, ఇరిగేషన్, కూడా, జిడబ్ల్యూఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ పూర్తికి పనిచేయండి

హైదరాబాద్, సీతారామ ఎత్తిపోతల పథకం పనులను త్రగా పూర్త ఇచేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రులు తెలిపారు. పనుల పురోగతిపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com